శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
# వార్త



## వేగంగా సర్
# కోటలో 96% శాతం పూర్తి

**కోట, జులై 13 ప్రభాతవార్త** కోట మండలంలో అధికార యంత్రాగం సర్ ప్రక్రియను పరుగులు పెట్టిస్తోంది. సోమవారం సాయంత్రం 6గంటలకు 96.73 శాతం పూర్తియినట్లు మండల తహిసీల్దార్ కె.జయజయరావు ప్రభాతవార్త కు తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలును ఇవ్వడంలో 100% శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు.నూరు శాతం డిజిటలైజేషన్ లక్ష్యంగా బిఎల్వోలు రాత్రిబవళ్లు పనిచేస్తున్నారని పేర్కొన్నారు.మంగళశారం అర్ధరాత్రికైనా 100 శాతం డిజిటైజేషన్ పూర్తి చేస్తామని జయజయరావు స్పష్టం చేశారు. ఇంకా ఎవరైనా పత్రాలు ఇవ్వకుండా మరిచి పోయి ఉంటే చివరి రోజు మంగళవారం లోపు ఆయా గ్రామాల్లోని బిఎల్ఒల వద్ద ఇవ్వలాని ఆయన కోరారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాకు దూరం కాకుండదని తహిశీల్దార్ జయజయరావు బిఎల్వోలకు మార్గనిర్ధేశం చేస్తున్నారు.

## రేపు టౌన్ హాలులో చేతన ఆధ్వర్యంలో
# ప్రత్యేక సాహిత్య సభ

**నెల్లూరు క్రైం, జూలై 13, ప్రభాతవార్త** సమాజంలో సాహిత్యం పాత్రపై అవగాహన కల్పించేందుకు చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక సాహిత్య సభ జరగనుంది. బుధవారం సాయంత్రం నెల్లూరు టౌన్‌హాల్‌లోని వర్ధమాన సమాజంలో ఈ కార్యక్రమం జరుగుతుందని నిర్వహకులు తెలిపారు. సాహిత్యము... సమాజము అనే అంశంపై విజయవాడకు చెందిన మధురగాన వాచస్పతి శ్రీహరిశంకర శర్మ ప్రసంగిస్తారు. ఈ సభకు తెలుగు భాషోద్యమ సమితి నెల్లూరు అధ్యక్షులు, కవి చలంచర్ల భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ కార్యక్రమాన్ని డా. యం. సుబ్రహ్మణ్యం, వై. శేషగిరీశం ఆధ్వర్యంలో చేతన వేదిక నిర్వహిస్తోంది. సాహిత్యాభిమానులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

# సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

**- రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ ఒంటేరు రవి బాబు**





**నెల్లూరు, జూలై 13, ప్రభతవార్త - కలెక్టరేట్** సమాచార హక్కు చట్టాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమర్థవంతంగా అమలు చేసి, దరఖాస్తుదారులకు నిర్ణీత గడువులోగా సమాచారాన్ని అందించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ ఒంటేరు రవి బాబు సూచించారు. సోమవారం నెల్లూరు పట్టణంలోని చెముడుగుంట జెడ్పీ హైస్కూల్, పంచాయతీ కార్యాలయం, విక్రమ సింహపురి యూనివర్సిటీ, విద్యుత్ భవన్, డీఈఓ కార్యాలయం, జిల్లా పరిషద్, డిపివో, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా కోర్టు, జిల్లా రిజిస్ట్రార్, డియంహెచ్ఓ, డిసిహెచ్ఎస్, డిఎస్పీ, కలెక్టరేట్, తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) అమలుపై ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

**ఆయా కార్యాలయాల్లో చట్టం** అమలుకు సంబంధించి అధికారులు చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. సమాచార హక్కు దరఖాస్తుల నమోదు, పరిష్కారానికి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు, ఇతర సంబంధిత పత్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించే కీలకమైన చట్టమని పేర్కొన్నారు. చట్టం కింద అందిన దరఖాస్తులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించి, దరఖాస్తుదారులకు పూర్తి సమాచారాన్ని అందించడం ప్రతి ప్రజా సమాచార అధికారి బాధ్యత అని తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి, మొదటి అప్పీలేట్ అధికారి వివరాలను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా బోర్డు ప్రదర్శించాలని సూచించారు. సమాచార హక్కు చట్టానికి సంబంధించిన రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ సక్రమంగా నిర్వహించాలని, చట్టంలోని నిబంధనల మేరకు స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని కార్యాలయ నోటీస్ బోర్డులు, వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సమాచార హక్కు చట్టాన్ని అధికారులు సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. తనిఖీల సందర్భంగా గుర్తించిన అంశాలపై సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేసి, లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. సమాచార హక్కు చట్టం అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కమిషనర్ రవి బాబు స్పష్టం చేశారు.

**- ఘన స్వాగతం..** కార్యక్రమానికి ముందు రాష్ట్ర సమాచార కమిషనర్ రవిబాబు జిల్లాలో పర్యటించేందుకు సోమవారం ఉదయం ఆర్ అండ్ బి అతిథి గృహానికి చేరుకున్నారు. జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి. వేణుగోపాల్ రెడ్డి, తదితరులు పూల మొక్కను అందజేసి ఘన స్వాగతం పలికారు.

# అర్జీదారుల సంతృప్తే ప్రధాన లక్ష్యం

**- వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టండి**
**- ప్రతి అర్జీని జాప్యం లేకుండా నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలి**
**- పరిష్కార వేదికకు 377 అర్జీలు - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



**నెల్లూరు, జులై 13, ప్రభాతవార్త - కలెక్టరేట్** అర్జీదారులు సంతృప్తిచెందేలా ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో పాటు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్వో విజయకుమార్, మెప్మా పీడీ కిరణ్ కుమార్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పట్ల జాప్యం లేకుండా ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి మానవతాదృక్పథంతో పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ శాఖ పరిధిలో కూడా అర్జీలు పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ప్రతిరోజూ తమ లాగిన్‌లలో అర్జీలను స్టేటస్ పరిశీలించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు. ప్రతి అర్జీని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**పరిష్కార వేదికకు 377 అర్జీలు..** సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 377 అర్జీలు రాగా దాంట్లో అధిక సంఖ్యలో రెవిన్యూ శాఖ 157, సర్వే శాఖ 33 పోలీస్ శాఖ 27, మునిసిపల్ 20 తదితర శాఖలు మరిన్ని ఉన్నాయి.

# ఖాకీఖి ప్రక్షాళన

**- ఒకేసారి 23 మంది బదిలీ - ఎస్పీ సంచలన నిర్ణయం..**
**- తప్పు చేస్తే చర్యలు తప్పవనే హెచ్చరిక**

**నెల్లూరు క్రైం, జూలై 13, ప్రభాతవార్త:** విధి నిర్వహణలో అలసత్వం, అవినీతి ఆరోపణలు, బాధితుల పట్ల నిర్లక్ష్య వైఖరి.. వెరసి బుచ్చిరెడ్డిపాలెం పోలీస్ స్టేషన్ సిబ్బందిపై జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం రాష్ట్రం లోనే సంచలనంగా మారింది. స్టేషన్‌లోని ఒక సీఐ, ఒక ఎస్సైతో సహా మొత్తం 23 మంది సిబ్బందిని ఒకేసారి బదిలీ చేస్తూ ఎస్పీ జారీ చేసిన ఆదేశాలు జిల్లా పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఏం జరిగింది? (నేపథ్యం) ఇటీవల వెలుగుచూసిన వ్యవసాయ అధికారి హత్య కేసులో బుచ్చిరెడ్డిపాలెం పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినప్పటికీ, ప్రారంభంలో పోలీసులు కేసును సీరియస్‌గా తీసుకోలేదన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎస్పీ, స్వయంగా జోక్యం చేసుకుని రూరల్ డీఎస్పీ ద్వారా దర్యాప్తు చేయించారు. ఆ దర్యాప్తులో అది హత్య అని తేలడంతో స్థానిక పోలీసుల వైఫల్యం బయటపడింది. పునరావృతమవుతున్న అలసత్వం కేవలం వ్యవసాయ అధికారి కేసు మాత్రమే కాదు, గతంలో ఒక రౌడీషీటర్ విషయంలోనూ స్థానిక పోలీసులు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించారు.



ఆ సమయంలో ఎటువంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే, ఆ రౌడీషీటర్ ఏకంగా ఒక మైనర్ బాలికపై హత్యాచారానికి పాల్పడేంత ధైర్యం చేశాడని సమాచారం. ఈ క్రమంలోనే గతంలో రౌడీ షీటర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహించారని కృష్ణపట్నం సీఐ, ముత్తుకూరు ఎస్సైలపై వేటు పడింది. తాజాగా బుచ్చిరెడ్డిపాలెం స్టేషన్ మొత్తం ప్రక్షాళనకు ఎస్పీ శ్రీకారం చుట్టారు. ప్రతి క్రైమ్ మీటింగ్‌లోనూ బాధితులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు ఎస్పీ పదేపదే సూచిస్తున్నారు. అయితే, కొందరు సిబ్బందిలో మార్పు రాకపోవడం, యథావిధిగా అవినీతికి పాల్పడటం, బాధితులను చిన్నచూపు చూడటంపై పలు సందర్భాల్లో ఎస్పీకి ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే, జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే స్టేషన్‌కు చెందిన మొత్తం సిబ్బందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేయడమే కాకుండా, సీఐ, ఎస్సైలను వీఆర్ (రిజర్వ్)కు పంపడం ద్వారా ఎస్పీ కఠిన సందేశాన్ని పంపారు. విధుల పట్ల అంకితభావం లేని వారికి, అవినీతికి పాల్పడే వారికి ఇదే హెచ్చరిక అని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఏకంగా పోలీస్ స్టేషన్ మొత్తాన్ని ప్రక్షాళన చేయడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు, బాధితులకు అండగా ఉండాల్సింది పోయి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఇలాంటి కఠిన నిర్ణయాలే సరైనవని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ చర్యతోనైనా పోలీసు యంత్రాంగంలో మార్పు వస్తుందని ఆశిస్తున్నారు.

# 'వివిఎస్‌యూ- బిసి సంక్షేమశాఖ మధ్య ఎంఓయూ'

**- హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు**



**నెల్లూరు జులై 13 ప్రభాతవార్త** విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం (వీఎస్‌యూ) హాస్టళ్ళల్లో నివసిస్తున్న అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వ బీసీ సంక్షేమ హాస్టల్స్ పథకాన్ని అమలు చేసేందుకు వీఎస్‌యూ మరియు ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా బిసి సంక్షేమ శాఖ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. విశ్వ విద్యాలయ పరిపాలన భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో వీఎస్‌యూ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ,రిజిష్ట్రార్ అచార్యకె. సునీత, జిల్లా బిసి సంక్షేమ మరియు సాధికారత అధికారి ( డి.బి.సి అండ్ ఇఒ) పి .వెంకటలక్ష్మి ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్పిడి చేసుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా విశ్వ విద్యాలయ హాస్టళ్ళలలో నివసిస్తున్న ప్రభుత్వ అర్హత ప్రమాణాలు కలిగిన ఓసి,బీసి, ఎస్‌సి ,ఎస్‌టి విద్యార్థులకు ఉచిత బోజనం,వసతి సౌకర్యాలు కల్పించనున్నారు. హాస్టల్ నిర్వహణ ఇరు సంస్థల సంయుక్త పరిపాలనా నియంత్రణలో కొనసాగుతుం దని పథకాలు అమలును పర్యవేక్షించేందుకు సంయుక్త పర్యవేక్షణ కమీటి ఏర్పాటు చేయనున్న ట్లు ఒప్పందంలో పేర్కున్నారు. ఈ అవగాహన ఒప్పందం తొలుత ఒక సంవత్సరం పాటు అమల్లో ఉండగా, ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో పొడగించే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమానికి ప్రాధన్యత ఇస్తు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్దవంతంగా అమలు చేయడానికి విశ్వవిద్యాలయం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన హాస్టల్ సౌకర్యాలు అందిచడంలో ఈ ఒప్పందం కీలకంగా నిలుస్తుందని రిజిష్టార్ ఆచార్య కె.సునీత పేర్కున్నారు. సదరు హాస్టల్ సౌకర్యాన్ని కల్పించినందుకు ఉపకులపతి,జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాని కలెక్టరేట్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వ విద్యాలయ విద్యార్థులకు అందించనందుకుగాను ఈకార్యక్రమంలో విశ్వ విద్యాలయం ప్రిన్సిఫల్ ఆచార్య పి.వీరారెడ్డి, విశ్వ విద్యాలయం హాస్టల్ వార్డన్లు డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, డాక్టర్ కోట, నీల మణికంఠ, ఆచార్య పి త్రివేణి, డాక్టర్ కె.వి.ఎల్ శ్రీకన్యారావు, జిల్లా బిసి సంక్షేమ శాఖకు చెందిన ఎంశ్రీదేవి (ఏబిసిడబ్ల్యూఓ), కె.మమత (హెచ్‌డబ్ల్యూఓ), సిహెచ్ సుమలత (హెచ్‌డబ్ల్యూఓ) హాస్టల్ కమీటి సభ్యులు పాల్గోన్నారు.

# సీమ ఎత్తిపోతల సాధనే ధ్యేయం

**- వైకాపా నేతలు స్పష్టం**



**నెల్లూరు, జూలై 13, ప్రభాతవార్త :** సీమ ఎత్తిపోతల సాధనే ధ్యేయమని వైకాపా నేతలు స్పష్టం చేశారు. నెల్లూరులో రాయలసీమ ఎత్తిపోతల పథకం టాస్క్ ఫోర్స్ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైకాపా నేతలు మాట్లాడుతూ రాయలసీమ లిఫ్ట్ గేమ్ చేంజర్ అని, నికర జలాల వినియోగానికి ఇదే ఏకైక మార్గమన్నారు. ఈ ప్రాజెక్ట్ లేకపోతే కేటాయించిన నీళ్లు వాడుకోలేమని వైకాపా నేతలు తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలను చంద్రబాబు తాకట్టు పెట్టారని, రాయలసీమ హక్కుల కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతమని సజ్జల రామకృష్ణా రెడ్డి స్పష్టం చేశారు. రాయలసీమ, నెల్లూరు, చెన్నైకి కేటాయించిన 101 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకునే ఏకైక మార్గమే రాయలసీమ ఎత్తిపోతల పథకం. జగన్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టు 80 శాతానికి పైగా పూర్తి రూ.900 కోట్లకు పైగా బిల్లులు చెల్లించగా కూటమి ప్రభుత్వం పనులు నిలిపివేసింది. పంపులు, మోటార్లకు ఆర్డర్లు ఇచ్చినా ప్రభుత్వం మారిన తర్వాత ప్రాజక్టును ఉద్దేశపూర్వకంగా కొనసాగించలేదు. తెలంగాణకు ఇచ్చిన రాజకీయ హామీ కారణంగానే చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్‌ను నిలిపివేశారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపుపై కేంద్రాన్ని ప్రశ్నించకపోవడం రాష్ట్ర ప్రయోజనాలపై **నిర్లక్ష్యా**నికి నిదర్శనం. పోలవరం ఎత్తు తగ్గింపు, బనకచర్ల వంటి కొత్త హామీలతో అసలు సమస్యను పక్కదారి పట్టిస్తున్నారు. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు పూర్తి చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం. అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, మేధావులు, పౌరసంఘాలు ఈ పోరాటంలో భాగస్వాములు కావాలి వైయస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం కేవలం ఒక సాగునీటి ప్రాజెక్టు కాదని, రాయలసీమ భవిష్యత్తును మార్చే "గేమ్ చేంజర్" అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు లేకుంటే రాయలసీమకు, ఉమ్మడి నెల్లూరు జిల్లాకు కేటాయించిన కృష్ణా నది నికర జలాలను కూడా వినియోగించుకునే పరిస్థితి ఉండదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో 80 శాతానికి పైగా పూర్తయిన ఈ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిలిపివేసి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని విమర్శించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, రాయలసీమ నీటి హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని చేపడతామని స్పష్టం చేశారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు, పోలవరం అంశం, రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు నిలిపివేత వంటి విషయాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని, రైతులు, మేధావులు, ప్రజాసంఘాలు, అన్ని రాజకీయ పక్షాలు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

❖ రాయలసీమ లిఫ్ట్ ఈ ప్రాంతానికి జీవనాధారమని, రాయలసీమ, నెల్లూరు, చెన్నైకి కృష్ణా జలాల్లో 101 టీఎంసీల నికర జలాల కేటాయింపు ఉన్నా, ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు, ఎగువ రాష్ట్రాల్లో కొత్త ప్రాజెక్టులు, తెలంగాణ రాష్ట్రం తక్కువ ఎత్తు నుంచే నీటిని తీసుకుంటున్న పరిస్థితుల వల్ల ఆ నీటిని వినియోగించుకునే అవకాశం క్రమంగా తగ్గిపోయిందన్నారు. ఈ సంక్షోభానికి ఏకైక పరిష్కారం రాయలసీమ ఎత్తిపోతల పథకమే అన్నారు.తెలంగాణ తీసుకుంటున్న అదే స్థాయి నుంచి రోజుకు 3 టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా వైయస్ జగన్ ఈ ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రాయలసీమ లిఫ్ట్ పనులు 80 శాతానికి పైగా పూర్తయ్యాయని, కాలువలు, సివిల్ పనులు పూర్తి చేసి రూ.900 కోట్లకు పైగా బిల్లులు చెల్లించామని గుర్తు చేశారు.పంపులు, మోటార్లకు కూడా ఆర్డర్లు ఇచ్చామని, ప్రభుత్వం మారిన తర్వాత వాటిని బిగించి ప్రాజెక్టును పూర్తి చేయాల్సింది పోయి కూటమి ప్రభుత్వం పనులు నిలిపివేసిందన్నారు. దీంతో రాయలసీమకు కేటాయించిన నికర జలాలను కూడా వినియోగించుకోలేని ప్రమాదం ఏర్పడిందన్నారు. రాయలసీమ లిఫ్ట్ పనులు నిలిపివేసింది కూటమి ప్రభుత్వమే అన్నారు. ఈ ఏడాది జనవరిలో తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు ఎందుకు ఆగిపోయిందో ప్రజలకు తెలిసిందన్నారు. ఆయనతో జరిగిన చర్చలో చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్‌ను ఆపేస్తానని చెప్పారని ఆయన వెల్లడించారన్నారు. దాదాపు పూర్తయిన ఈ ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నిస్తే ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టమైన సమాధానం చెప్పలేదని వాపోయారు. ఒకసారి పర్యావరణ అనుమతుల పేరుతో, మరోసారి ప్రాజెక్టును తామే ఆపలేదంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిందని, కానీ అందుకు విరుద్ధంగా ఆధారాలను కూడా తాము ప్రజల ముందుంచామన్నారు. ప్రస్తుతం నీటి లభ్యతపై తీవ్ర అనిశ్చితి నెలకొన్న సమయంలో రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టి ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు వల్ల కేవలం రాయలసీమ మాత్రమే కాదు, కృష్ణా జలాలపై ఆధారపడిన మొత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభావితమవు తుందన్నారు. అయినా ఆల్మట్టి ఎత్తు పెంపుపై చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని ప్రశ్నించడం లేదని, గతంలోనూ ఇదే వైఖరి ప్రదర్శించారన్నారు. ఇప్పుడు కూడా కేంద్రంలో కీలక పాత్రలో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక్క మాట మాట్లాడకుండా ఇరిగేషన్ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పోలవరం ఎత్తు తగ్గింపు అంశంపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని, రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు పూర్తి చేయడం, ఆల్మట్టి ఎత్తు పెంపుపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం, పోలవరం అంశంపై ప్రభుత్వం సమాధానం చెప్పేలా చేయడం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని రాజకీయ పార్టీలు, పౌరసంఘాలు, మేధావులతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు. పూర్తి కావాల్సిన రాయలసీమ లిఫ్ట్‌ను వదిలేసి బనకచర్ల పేరుతో కొత్త భ్రమలు సృష్టించడం ప్రజలను మోసం చేయడమే అని ఎద్దేవా చేశారు. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టే రాయలసీమ భవిష్యత్తును మార్చే గేమ్ చేంజర్ అన్నారు. అది లేకపోతే రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు కేటాయించిన నికర జలాలను కూడా వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అందుకే రైతులు, మేధావులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలన్నీ ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. రాయలసీమ సాగునీటి హక్కుల కోసం కార్యాచరణ రూపొందించామని తెలిపారు.రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిల్లో సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేసి ఉద్యమాన్ని గ్రామస్థాయికి విస్తరించాలని నిర్ణయించామని,రాయలసీమ ఎత్తిపోతల పథకం, ఇతర సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యంపై సాంకేతిక నిపుణులు, మేధావులు, రాజకీయ నాయకులతో జిల్లా, నియోజకవర్గ స్థాయిలో అవగాహన సమావేశాలు నిర్వహించనున్నామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 10 మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేసి పార్టీ ప్రతినిధులతో పాటు మేధావులు, రైతులు, పదవీ విరమణ పొందిన అధికారులు, ఇంజనీర్లు సభ్యులుగా ఉండేలా చర్యలు చేపట్టామన్నారు.. ఈ ప్రక్రియను జూలై 25లోపు పూర్తి చేయాలని నిర్ణయించామని తెలిపారు.జూలై 30న అన్ని జిల్లాల్లో కొత్త కమిటీలతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించి జిల్లా వారీ కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయనున్నామన్నారు.రాయలసీమ ఎత్తిపోతల పథకం సహా ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదికలు రూపొందించి ప్రజల ముందుకు తీసుకురావాలని నిర్ణయించామని తెలిపారు. కమిటీ సభ్యులకు సాగునీటి ప్రాజెక్టుల సాంకేతిక, చారిత్రక, న్యాయపరమైన అంశాలపై ప్రత్యేక ఓరియంటేషన్, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ సభ్యులు అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ అసెంబ్లీ కమిటీలతో సమీక్ష సమావేశాలు నిర్వహించి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. పదవీ విరమణ పొందిన ఇంజనీర్లు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు, నీటి వనరుల నిపుణులతో ప్రత్యేక సలహా కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమానికి సాంకేతిక, విధానపరమైన సహకారం అందించనున్నారని తెలిపారు. ఆగస్టు నెలలో ప్రతి జిల్లాలో భారీ బహిరంగ సభలు నిర్వహించి రాయలసీమ సాగునీటి హక్కుల కోసం ప్రజలను చైతన్యపరుస్తూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని సమావేశంలో నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో వై.యస్.ఆర్. సి.పి. రాష్ట్ర సమన్వయ కర్త సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి, రాయలసీమ ఎత్తిపోతల పథకం టాస్క్ ఫోర్స్ కమిటీ కన్వీనర్ సాకే శైలజనాథ్, మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షుడు డాక్టర్.కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూమన కరుణాకర్ రెడ్డి, గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, రాయలసీమ, ఉమ్మడి నెల్లూరు ప్రకాశం జిల్లాలకు చెందిన పార్టీ సమన్వయకర్తలు, ముఖ్యమైన నాయకులు హాజరైయ్యారు.

# బుచ్చి పోలీస్‌స్టేషన్‌పై వేటు

**- సిఐ మాతంగి శ్రీనివాసరావు రేంజ విఆర్‌కి**
**- ఎస్ఐ సతోష్‌రెడ్డి జిల్లాలో విఆర్‌కి**
**- 21 మంది కానిస్టేబుల్స్ పై బదిలీ వేటు**
**- జిల్లా చరిత్రలో సంచలనం**
**- దటీజ్ జిల్లా జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల**








**బుచ్చి, జూలై 13, ప్రభాతవార్త :** జిల్లా చరిత్రలో ఇంత వరకు ఎప్పుడు జరగని విధంగా ఒక పోలీస్‌స్టేషన్ మొత్తంపై వేటు పడిన సంఘటన బుచ్చి పోలీస్‌స్టేషన్‌కి జరిగింది. ఇటీవల జరిగిన బుచ్చిమండలం వ్యవసాయాధికారి శ్రీహరి మృతి హత్యకాగా దానిని తప్పుదోవ పట్టించినందుకు పర్యావసనం ఇది. జిల్లా ఎస్‌పి అజితా వేజండ్ల నిర్ణయాన్ని జిల్లా ప్రజలు స్వాగతిస్తున్నారు. సూపర్ ఎస్పీ అంటు ప్రశంసిస్తున్నారు. మండల వ్యవసాయాధికారి శ్రీహరి మృతి చెందిన రోజు మినగల్లుకి వెళ్లిన ప్రతి ఒక్కరికి మృతదేహాన్ని చూస్తేనే అర్ధం అవుతుంది ఇది ముమ్మాటికి హత్యే నని కాని కుటుంబసభ్యులు మౌనం అందర్ని కట్టి పడవేసింది. మౌనం వెనుక ఆంతర్యం అర్ధంకాక అందరి మనస్సులు భరువెక్కాయి. చేతికి గ్లౌజులు వేసుకుని శ్రీహరి బాడిమొత్తాని పరిశీలించిన సిఐకి అర్ధమైనా విచారణ చేపట్టకుండా గుండెపోటు అంటు మౌనం వహించడంతో కేసు తప్పుదోవ పట్టింది.

మృతుడు శ్రీహరి మొదటి భార్య గ్రీవెన్స్‌లో అర్జీ ఇవ్వడంతో జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఈ కేసు పై దృష్టిపెట్టారు. డిఎస్‌పి ఘంటా శ్రీనివాసరావుకి కేసును విచారించమని ఆదేశించడంతో అసలు కథ బయటపడింది.సొంత బావమరిదే మరో ఇద్దరితో కలిసి ఇంతటి ఘాతకానికి ఒడి కట్టాడని, ఇది ముమ్మాటికి హత్యేనని విచారణలో తేలడంతో జిల్లా ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐ మాతంగి శ్రీనివాసరావుని రేంజి విఆర్‌కి బదిలీ చేశారు. అలాగే ఎస్ఐ సంతోష్‌రెడ్డిని జిల్లాలో విఆర్‌లో ఉంచారు. 21 మంది కానిస్టేబుల్స్‌ని బదిలీ చేసి జిల్లా ఎస్పీ సంచలన నిర్ణయం తీసుకున్నారు.దీంతో పోలీస్ శాఖ ఒక్కసారిగా ఉలిక్కి పడింది.

# శ్యామసుందరపురంలో మంచినీటి సమస్య పరిష్కారం

## టిడిపి నాయకుడు జలీల్ ఆహ్మద్



**కోట, జూలై 13 ప్రభాతవార్త :** మేజర్ పంచాయతీ కోటలోని శ్యామసుందరపురంలో దీర్ఘకాలంగా ఉన్న మంచినీటి సమస్యకు పరిష్కారం లభిం చింది. శ్యామసుందరపురంలో మంచినీటి సమస్య తరచూ ఏర్పడుతుందని అక్కడి ప్రజలు జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్ దృష్టికి తీసుకెళ్లగా గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్కుమార్కి తెలియజేశారు. ఆయన సూచనలతో కోట పంచాయతీ నిధుల నుంచి హ్యాండ్బోర్కు నిధులు మంజూరు చేయించారు. ఆ మేరకు శ్యామసుం దరపురంలో బోర్ వేయించారు. సోమవారం నూతన బోరును జలీల్ అహ్మద్, నల్లపరెడ్డి జగన్మోహ న్రెడ్డిలు ప్రారంభించారు. జలీల్ అహ్మద్ మాట్లాడుతూ కోటలోని శ్యామసుందరపురం, నార్త్ గిరిజన కాలనీ, శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఆ మేరకు ఆయా ప్రాంతాల్లో ఓవర్హెడ్ ట్యాంకుల కోసం ప్రతిపాదనలు పంపామని చెప్పారు. కోట పంచాయతీ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తూ ముందుకు పోతున్నామన్నారు. రెండేళ్ల పాలనలో కోటలో కోట్లాదిరూపాయాలతో అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. ప్రజల సమస్యలను తన సమస్యగా భావించి పనిచేయడం జరుగుతోందన్నారు. ఇందకు శాసన సభ్యులు సునీల్కుమార్ సహకారంతో ప్రతి పని చేయడం జరుగుందున్నారు. ముందుగా శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్ కు జలీల్ఆహ్మద్ కృజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లపరెడ్డి జగన్మోహన్రెడ్డి,ఎంపిటిసిలుషం షుద్దిన్, దారా సురేష్, సుహాసిని, నందం మోహన్, పల్లం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి కార్యకర్తలపై కేసులు వైసిపి నేతకలు అండదండలా

## జిల్లాతెలుగు యువత ఉపాధ్యక్షులు పైడి హర్ష

**కావలి, జులై 13 ప్రభాతవార్త :** పార్టీ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసినా టిడిపి కార్యకర్తలకు నేడు విలువ లేకుండా కులవివక్షత పెరిగిపోయిందని జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షులు పైడి హర్ష ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికజర్నలిస్టు క్లబ్లో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తన సొంతపొలంలో మట్టి చదును చేసుకునేందుకు మట్టి తీసినా తమపై కేసులు నమోదు చేస్తున్నారని అదే సమయంలో వైసిఆర్ పార్టీకి చెందిన వారు ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నా వారిపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.



గతంలో నాపై 28కేసులు పెట్టి రౌడీషీటర్ కూడా పెట్టినా పార్టీని వీడకుండా నమ్ముకొని ప్రాణత్యాగానికైనా సిద్దం అంటూ పార్టీని గెలిపించుకుంటే ఇప్పుడు టిడిపి పార్టీకి చెందిన ఎమ్మెల్యే బిసి, ఎస్సి, ఎస్టి లీడర్లను అనిచవేతకు గురి చేస్తున్నారని వాపోయారు. గతంలో పలు కేసులుపెట్టి వేధింపులకు గురిచేసిన సుకుమార్రెడ్డి ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు అనుమతులు కల్పించి రక్షణ కల్పిస్తున్నది ఎమ్మెల్యే కాదా అని ప్రశ్నించారు. పార్టీకోసం పనిచేయని వారికి కాంట్రాక్టు పనులు అప్పచెప్పడం ఎంతవరకు సబబు అన్నారు. రామారావు విగ్రహాన్ని ఉరివేసి తొలగించిన అవమానించిన ఘటనలో కరుణాకర్ మృతికి కారణమని ఆరోపణలు ఎదుర్కొంటున్న వైకాపా నాయకుడు జగదీశ్వర్రెడ్డిపై ఇప్పటి వరకు చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. ఎమ్మెల్యే బావమరిది సామంతల కిరణ్కుమార్రెడ్డికి గ్రావెల్, ఇరిగేషన్ సంబంధిత వ్యాపారాలన్నీ అప్పగించారని మేము ఎలాంటి అక్రమ వ్యాపారాలు చేయలేదని స్పష్టం చేశారు. పార్టీకోసం పోరాడి గత ప్రభుత్వంలో కేసులు పెట్టించుకొన్నామని ఇప్పుడు సొంత పార్టీలో కూడా కేసులు ఎదుర్కోవల్సిన పరిస్థితి రావడం భాదాకరంగా ఉందన్నారు. దళితులపై కులవివక్ష చూపుతూన్నరని ఎమ్మెల్యేపై ఆరోపించినా ఆయన తనకు జరుగుతున్న అన్నాయంపై పార్టీ అధిష్టానానికి ఇప్పటికే ఫిర్యాదు చేశారని, కావలిలో పార్టీ గాడి తప్పుతోందని అంశాన్ని కూడా అధినాయకుల దృష్టికి తీసుకెలుతామని వెల్లడించారు. ఎన్ని కుట్రలు జరిగినా బిసి. ఎస్సి, ఎస్టి వర్గాలు టిడిపితోనే ఉంటామని పైడి హర్షం స్పష్టం చేశారు.

# ఫెండ్లీ ప్రభుత్వంలో ఉద్యోగులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం వమ్ముకాదు

**నెల్లూరు, జూలై 13, ప్రభాతవార్త – కలెక్టరేట్ :** బొప్పరాజు నాయకత్వంలో ఏపిజెఎసి అమరావతి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఉద్యోగులకు పెన్షనర్లకు ఇచ్చిన హామీలను మరచిందని ప్రభుత్వం పై పోరు ప్రకటించిన విషయం విదితమే. ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ సన్నిద్దానికి సిద్ధమై ఉద్యోగుల డిమాండ్ల సాధనకై ఈ నెల 12వ తేదీ శ్రీకాకుళంలోనూ, 21వ తేదీ అనంతపురం జిల్లాలోనూ ఉద్యమ సన్నిద్ధ సభలను ఏర్పాటు చేసి తొలి దశ ఉద్యమానికి సన్నిద్ధమై ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగుల ఐక్యతతో ముందుకు సాగాలని నిర్ణయించింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సన్నిద్ధమై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, రెవెన్యూ శాఖల మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్లు ఏపిజెఎసి అమరావతి నాయకులతో శనివారం రాష్ట్ర సచివాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన హాజరైన ఏపీ జెఎసి అమరావతి రాష్ట్ర ప్రతినిధులు ప్రభుత్వ ప్రతినిధులైన ఇద్దరు మంత్రుల ముందు సమర్పించిన ప్రధాన డిమాండ్లు పిఆర్సి కమీషనర్ని వెంటనే నియమించాలని మధ్యంతర భృతిను వెంటనే ప్రకటించాలి. జులై 1 2018 నుంచి 1 జులై 2026 వరకు చెల్లించవలసిన డిఎ బకాయిలను వెంటనే చెల్లించాలని 2024 జులై ఒకటి నుండి 2026 జులై వరకు మొత్తం ఐదు డిఎలను తక్షణమే మంజూరు చేయాలని క్రొత్త పింఛను విదానంను రద్దుచేసి పాత పించన్ విధానంను అమలు చేయాలని వేల కోట్లకు పేరుకుపోయిన డిఎ 11వ పిఆర్సి, జిపిఎఫ్ సరెండర్ లీవ్ మొదలగు పెండింగ్ బకాయిలును ప్రతి ఉద్యోగి యొక్క పేస్లిప్లో పొందుపరచాలని రిటైర్డ్ ఉద్యోగులకు గత ప్రభుత్వం తగ్గించిన ఆడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్సను పునరుద్ధరించాలని ఏపిఎస్ఆర్టిసిలో విద్యుత్ బస్సులను ప్రభుత్వమే నిర్వహించాలి. 2010 వ సంవత్సరానకు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టిఈటి మినహాయింపు కల్పించాలని కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా, ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలును వర్తింప చేయాలి మరియు ఉద్యోగ భద్రత కల్పిస్తూ హెచ్ఆర్ పాలసీ వర్తింపుచేయాలని ప్రభుత్వ శాఖలలో గ్రూప్ 4వ జూనియర్ అసిస్టెంట్ నియామకాలును చేపట్టాలని అవసరమైన నిపుణులతో ప్రాథమిక స్థాయిలో ఉద్యోగులకు కనీస శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని నిర్లక్ష్యానికి గురైన ఉద్యోగుల హెల్త్ కార్డును వెంటనే పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలని ప్రముఖ వైద్య నిపుణులు సిఫారసుల ప్రకారం రాష్ట్రస్థాయి కమిటీ సూచించిన కొత్త వ్యాధులను మెడికల్ ఇన్వాల్యుడేషన్ పథకంకు చేర్చి ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలి.పదివేల రూపాయలు లోపు పెన్షన్ తీసుకుంటున్న పెన్షనర్లకు రేషన్ కార్డు మంజూరు చేయుటకు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలి. జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తూ చనిపోయిన టీచర్ల కుటుంబ సభ్యులకు ఖాళీ ఉన్న ప్రభుత్వ శాఖలలో కారుణ్య నియామకం క్రింద ఉద్యోగాలు కల్పించాలి. వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తూ క్రమబద్ధీకరణ కాకుండా మిగిలిపోయిన 4562 మంది కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరణ చేయాలని గ్రామ సహాయకులకు గౌరవ వేతనం రూ. 21,500/ కి పెంచాలిసుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న మున్సిపల్ ఉద్యోగుల సర్వీస్ రూల్సు్న తక్షణమే రూపొందించాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు వారి ప్రొబేషన్ కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్లు, ఆరు సంవత్సరముల సర్వీస్కు స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు ఇస్తున్న రెండు సంవత్సరాల చైల్డ్ కేర్ లీవును రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు కూడా అమలు చేయాలని ఏపీ జేఏసీ అమరావతి ఇచ్చిన డిమాండ్లుపై రెండు రోజులు ప్రభుత్వం చర్చలు జరపడంతో ఉద్యోగులకు ప్రభుత్వం పై నమ్మకం కలిగిందని డిమాండ్లను మంత్రులు ఇరువురు క్షుణ్ణంగా పరిశీలించడమే కాకుండా, ఉద్యోగుల సమస్యల పట్ల ముఖ్యమంత్రి వర్యులు పూర్తిసానుకూలంగా ఉన్నారని అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను కూడాదృష్టిలో ఉంచుకుని అన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగినప్రయత్నం చేస్తుందని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యలపై చర్చిచేందుకు ఈనెల 21వ తేదీన సచివాలయంలో అన్ని ఉద్యోగసంఘాలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వారి అధ్యక్షతన జాయింట్ స్టాప్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రులు ఇరువురూ ప్రకటించడమే కాకుండా. ఈలోగా రాష్ట్ర ఆర్థికమంత్రి వర్యులతో కూడా ఉద్యోగ సంఘాల సమస్యలపై మరొక సారి చర్చిస్తామని మంత్రులు హామీ ఇవ్వడంపై జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షన్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.ఉద్యోగుల ఆర్థిక,ఆర్థికేతర సమస్యలు అన్ని ఈనెలలోనే జరపబోవు ఉద్యోగసంఘాలతో సమావేశంలో ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తారన్న నమ్మకం ఉద్యోగులకు ఉంది కాబట్టి ఉద్యమ సన్నిద్ధ కార్యక్రమాల కార్యాచరణను వాయిదా వేసుకోవాలని మంత్రులు ఇరువురు ఏపిజెఎసి అమరావతి రాష్ట్ర ప్రతినిధులను కోరినందున శ్రీకాకుళంలో జరగనున్న ఉద్యమ సన్నిద్ధ సమావేశాన్ని ఏపిజెఎసి అమరావతి రాష్ట్ర ప్రతినిధులు వాయిదా వేసారు. ఏపీ జెఎసి అమరావతి రాష్ట్ర సంఘ నేతలు ప్రస్తావించిన అంశాలన్నింటినీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. ఉద్యోగ సంఘాల నేతలతో ప్రభుత్వం ఈనెల 21వ తేదీన జరుపబోయే సమావేశంలో అన్ని సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుని ఆశిస్తూ, ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణ గురించి సదరు సమావేశం అనంతరం తుది నిర్ణయాన్ని ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏపిజెఎసి అమరావతి జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ ఓవి ప్రసాద్, పాటు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు జానా చైతన్య కిషోర్, ఏపీ జేఏసీ అమరావతి సిటీ జనరల్ సెక్రెటరీ బి మాల్యాద్రి, నెల్లూరు డివిజన్ జనరల్ సెక్రెటరీ ఏ రవికుమార్, ఆర్టీసీ సంఘ జిల్లా నాయకులు పి సతీష్ కుమార్, ఎస్ రమేష్ బాబు, పాల్గొన్నారు.




# ఆత్మకూరులో త్రాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



**ఆత్మకూరు, జులై 13,ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలో తాగునీటి సమస్య ఇటీవల తీవ్రంగా ఉండగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించి రెండు రోజుల్లోనే ప్రజలకు ప్రతిరోజు మంచినీళ్ల సమృద్ధిగా అందించే ఏర్పాటు చేస్తున్నామని పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గతంలో ప్రతిరోజు ఆత్మకూరు ప్రజలకు మంచి నీరు ఇవ్వాలన్న సంకల్పంతో అప్పటి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బృహత్తర త్రాగునీటి పథకాన్ని సాధించారని, సోమశిల వద్ద జలాశయం నుండి ఆత్మకూరు పట్టణానికి తాగునీటి సరఫరా చేస్తూ ప్రజలకు సమృద్ధిగా ప్రతిరోజు అందిస్తున్నామన్నారు. ఇటీవల కొన్ని కారణాలతో పట్టణంలో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు.తాము వెంటనే స్పందించి అధికారులతో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టామన్నారు.మూడు నెలల క్రితమే ఉత్తర కాలువ పనుల కోసం నీటిని నిలిపివేయగా వెంటనే అధికారులను తీసుకెళ్లి ప్రత్యేకంగా అధిక సామర్థం గలిగిన మోటర్ ను ఏర్పాటు చేశామన్నారు. అయినా ఆ మోటార్ ద్వారా ప్రతిరోజు సమృద్ధిగా సరిపడా నీరు అంధనందున ఇటీవల మరో అధిక సామర్థం గల మోటార్ను ఏర్పాటు చేశామని,రెండు మోటార్లు ఏర్పాటుతో ట్రాన్స్ఫార్మర్ కెపాసిటీ చాలానందున ఐదు లక్షల రూపాయలు మున్సిపాలిటీ తరఫున చెల్లించి అధిక సామర్థం గల ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. తీరా నీటిని విడుదల చేసే సమయంలో రేవూరు వద్ద ఒక వైసీపీ నాయకుడు బోయళ్ల రవీందర్ రెడ్డి రహదారి అంచునే ఒక బోర్ వేయగా ఆత్మకూరుకు నీరందించే పైపులు పగిలిపోయాయన్నారు. దాన్ని కూడా యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించామని,పైపుల్లో నీరు పూర్తిగా లేనందున గాలి చేరుకొని నీరు పైపుల ద్వారా రావడం లేదన్నారు. గతంలో అప్పారావు పాలెం సమీపంలోని పెన్నా నది వద్ద ఉన్న తాగునీటి పథకం పైపులను ప్రధాన బృహత్తర త్రాగునీటి పథకానికిఅనుసంధానం చేస్తున్నామన్నారు.రెండు రోజుల్లోగా తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని, ప్రజలకు సమృద్ధిగా త్రాగునీరు అందించే చర్యలు తీసుకున్నామని చంద్రారెడ్డి పేర్కొన్నారు. అయితే వైసిపి నాయకులు తమ ప్రభుత్వం సక్రమంగా తాగునీరు అందించలేని పరిస్థితిలో ఉందంటూ విమర్శలు చేశారని, గతంలో ఆనం రామనారాయణ రెడ్డి బృహత్తర తాగునీటి పథకం సాధించగా 10 ఏళ్లలో దాని గురించి ఏనాడైనా వైసీపీ నాయకులు గానీ ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకున్నారా అని ఆయన ప్రశ్నించారు. తమ కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం కోసం ప్రత్యేకంగా పాటు పడుతూనే అందరికీ అన్ని విధాల మౌలిక వసతులు కల్పించే లక్ష్యంగా కృషి చేస్తుందన్నారు. ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు పట్టణం పై దూరదృష్టితో బృహత్తర త్రాగునీటి పథకాన్ని మంజూరు చేయించారన్నారు. అయితే రిపేర్లు రావడం సహజమని, అది కాక వైసీపీ నాయకుడే బోర్ వేసి పైపులు పగలగొట్టాడని తాము వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఏనాడు ఆత్మకూరు పట్టణ ప్రజల దాహార్తి తీర్చే పథకం గురించి గానీ నిర్వహణ గురించి గానీ వైసీపీ ప్రజా ప్రతినిధులు పట్టించుకున్నారా అని ఆయన ప్రశ్నించారు. ఏదేని ఒక పథక నిర్వహణలో మరమ్మతులు రావడం సహజమని, వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన సరి చేస్తున్నా విమర్శలు చేయడం సరికాదన్నారు. అనేక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేస్తున్నామని, అత్యవసరంగా అధిక సామర్థం గా ట్రాన్స్ఫర్మర్ను, మోటార్లను సమకూర్చి ఏర్పాటు చేశామని అన్నారు.గతంలో అక్కడక్కడా చిన్నపాటి లీకేజీలు ఉన్న తాగునీటి సరఫరాలో సమస్యలు లేనందున కొనసాగించామని, ఇటీవల సమస్య ఉత్పన్నం కావడంతో వెంటనే స్పందించి అధికారులతో పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టామన్నారు. మరో రెండు రోజుల్లో ఆత్మకూరు పట్టణ ప్రజలకు సమృద్ధిగా ప్రతినిత్యం సాగునీరు అందించే ఏర్పాట్లు చేశామని చంద్ర రెడ్డి పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా వైసిపి నాయకులు విమర్శలు చేయడం అర్థరహితమని చంద్రారెడ్డి అభిప్రాయపడ్డారు.ఈ సమావేశంలో పట్టణ తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి తోడేటి వెంకటయ్య,మాజీ కౌన్సిలర్లు సూరా భాస్కర్ రెడ్డి,దగ్గు మాటి శివకోటరెడ్డి,షేక్ గౌస్ బాషా, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, పట్టణ తెలుగుదేశం నాయకులు చల్లా వెంకటేశ్వర్లు రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ పీజీఆర్ఎస్ లో 157 ఫిర్యాదులు స్వీకరణ



**నెల్లూరు క్రైమ్, జూలై 13, ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను సత్వరంగా పరిష్కరించడంతో పాటు, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా విచారించి న్యాయం చేయాలని ప్రజా వినతులు పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పి అజిత వేజెండ్ల సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమ వారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ, ఇతర అధికారుల సమక్షంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి 157 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల పట్ల ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా, జవాబుదారీతనంతో వ్యవహరించాలి. ప్రతి పిటిషన్ను సమగ్రంగా విచారించి త్వరితగతిన పరిష్కరించాలని, బాధితులకు చట్టపరమైన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలి అని ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు సూచనలు ఇచ్చారు. అల్లూరు పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన పిర్యాది, తన 20 ఎకరాలలో వేసిన వరినీ బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన రైస్ మిల్ యజమానులు అయిన బత్తల సీతారామయ్య, బత్తల. వెంకటేశ్వర్లు, మందాటి. వెంకటేశ్వర్లు తీసుకొని సుమారు రూ.12 లక్షలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు, అడిగితే చంపుతామని బెదిరిస్తున్నట్టు విచారించి న్యాయం చేయమని పిర్యాది కోరారు. కోవూరు పోలీస్ స్టేషన్ పరిధికీ చెందిన మహిళా, శ్రీకాకుళం జిల్లాకు చెందిన రామకృష్ణ అనే వ్యక్తి హైదరాబాద్లో ఉన్నప్పుడు తనను ప్రేమిస్తున్నాని, పెళ్లిచేసుకుంటానని చెప్పి తన అవసరాలకోసం పిర్యాది దగ్గర రూ.2 లక్షలు తీసుకొని పెళ్లిచేసుకోకుండా మోసం చేసినట్టు సదరు వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నట్టు, విచారించి రామకృష్ణ అతని కుటుంబ సభ్యుల మీద చర్యల కొరకు పిర్యాదు చేశారు. బాలాజినగర్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన పిర్యాది,తను వృద్ధాప్యం లో ఉన్నట్టు, ప్రస్తుతం తన 3వ కుమారుడు రమేష్ వృద్ధాప్యంలో ఉన్నా మమ్ములను వదిలివేసి, బాగోగులు పట్టించుకోకుండా, తాను అప్పుగా ఇప్పించిన డబ్బును తిరిగి చెల్లించకుండా ఇబ్బందులకు గురించి చేస్తున్నట్టు, అడిగితే బెదిరిస్తున్నట్టు, సదరు విషయమై విచారించి చర్యల కొరకు పిర్యాదు చేశారు. పిజిఆర్ఎస్ నందు వచ్చిన ప్రతి ఫిర్యాదుపై చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్. పి అడ్మిన్ సిహెచ్ సౌజన్య, నెల్లూరు ఏఎస్పి దీక్ష, డీటీసీ డిఎస్పి గిరిధర్, డబ్ల్యూపిఎస్ సీఐ సుబ్బారావు, పిసిఆర్ సీఐ భక్తవత్సల్ రెడ్డి, ఎస్బి 1 సీఐ దశరద రామారావు, ఎస్బి 2 సీఐ శ్రీనివాసులు రెడ్డి, పీజీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహా కుంభాభిషేకం కోసమే వ్యక్తిగత ఖాతా వినియోగం



**తోటపల్లి గూడూరు, జూలై 14, ప్రభాతవార్త:** మండలంలోని వరిగొండ గ్రామంలో వెలసియున్న శ్రీ జ్వాలాముఖి అమ్మవారి ఆలయానికి సంబంధించిన విరాళాల వ్యవహారంపై వచ్చిన ఆరోపణలకు ఆలయ చైర్మన్ కోడూరు రాజేశ్వరి వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీ జ్వాలాముఖి అమ్మవారి మహా కుంభాభిషేక మహోత్సవాల నిర్వహణకు సుమారు రూ.30, నుండి 40 లక్షల వరకు వ్యయం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిగా భక్తుల విరాళాలతో నిర్వహిస్తున్నందున, విరాళాల సేకరణను సులభతరం చేయడానికి తాత్కాలికంగా తన వ్యక్తిగత బ్యాంకు ఖాతాను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. మహా కుంభాభిషేకానికి అందిన ప్రతి రూపాయిని ఆలయ అవసరాల కోసమే వినియోగిస్తామని, వ్యయానికి సంబంధించిన పూర్తి లెక్కలు పారదర్శకంగా నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. అంచనా వ్యయాన్ని మించి ఖర్చు అయినా, ఆ అదనపు మొత్తాన్ని కూడా వ్యక్తిగతంగా తానే భరిస్తానని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనం లేదని, కేవలం మహా కుంభాభిషేక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అసత్య ప్రచారాలను నమ్మవద్దని, భక్తులు ఎలాంటి అపోహలకు గురికాకుండా ఆలయ అభివృద్ధికి సహకరించాలని రాజేశ్వరి విజ్ఞప్తి చేశారు.

# కోటలో దొంగలు హల్చల్

**కోట, జూలై 13 ప్రభాతవార్త :** కోటలో ఆదివారం రాత్రి బైక్ దొంగలు హల్చల్ చేశారు. కోటలోని ఆకుతోటదిబ్బ ప్రాంతంలో షేక్ జమాల్కు చెందిన స్కూటర్ను చోరీ చేశారు. ఆ మేరకు బాధితుడు జమాల్ కోట పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారు. ఎన్సిఆర్ నగర్లో తాళం పగులగొట్టి మరో స్కూటర్ను చోరీ చేసేందుకు దుండగులు విఫలయత్నం చేశారు. ఆ ప్రాంతంలోని మూడు స్కూటర్లను చోరీ చేసేందుకు ప్రయత్నించారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ తిరగడం లేదని ఆయా ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా విద్యానగర్కు చెందిన రవీంద్రారెడ్డి బైక్ పట్టపగలే చోరీకి గురైంది. నేటికీ ఆబైక్ ను పోలీసులు గుర్తించలేదు .విద్యానగర్లో కూడా రాత్రి వేళ్లలో గస్తీ నామమాత్రంగా తిరుగుతున్నారని అక్కడ ప్రజలు ఆరోపిస్తున్నారు.కోట,విద్యానగర్ల్లో రాత్రి వేళ్లల్లో పోలీసులు గస్తీ ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# డయల్ యువర్ ఎస్.ఈ. కార్యక్రమానికి 12 ఫిర్యాదులు



**నెల్లూరు, జూలై 13, ప్రభాతవార్త – వైద్యం :** నెల్లూరులోని విద్యుత్ భవన్ నందు నిర్వహించిన డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ డివిజన్ల నుండి మొత్తం 12 ఫిర్యాదులు అందినట్లు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం తెలిపారు. ఈ ఫిర్యాదులు ముఖ్యంగా సోలార్ సబ్సిడీ, విద్యుత్ అంతరాయం, లో వోల్టేజ్ సమస్యలు, పోల్ షిఫ్టింగ్, ట్రాన్స్ఫార్మర్ మంజూరు చేయాలని, వ్యవసాయ నూతన సర్వీసులు తదితర అంశాలకు సంబంధించినవిగా ఉన్నాయని తెలిపారు. వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం"డయల్ యువర్ ఎస్.ఈ. కార్యక్రమం నిర్వహించబడుతున్నదని, వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మునీంద్ర, అసిస్టెంట్ ఇంజనీర్లు నరసింహారావు, తిరుపతయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# ఆత్మకూరు ఆర్టీసీ డిపో వద్ద వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి విశేష స్పందన అన్ని డిపోలో నిర్వహిస్తామన్న చైర్మన్




**ఆత్మకూరు జులై 13,ప్రభాతవార్త** ఆత్మకూరు ఆర్టీసీ డిపో వద్ద సోమవారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్ రెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ ఊర్లోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఆయుష్ వైద్యశాల అభిరామ హాస్పిటల్లో సంయుక్త సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని సురేష్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు డిపోలో కార్మికులకు నిర్ణయించామని దాంతోపాటు ప్రతి శుక్రవారం కూడా మెడికల్ క్యాంపు నిర్వహించేలా సన్నాహాల్లో ఉన్నామని ఆయన పేర్కొన్నారు ఆర్టీసీ కార్మికులతో పాటు ప్రయాణికులకు కూడా ఈ శిబిరాల్లో వైద్య పరీక్షలు ఆయన పేర్కొన్నారు ఆర్టీసీ ఆత్మకూరు డిపో మేనేజర్ ఎం శివకేష్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు వైద్యులు వైద్య నిపుణులు పాల్గొని కార్మికులకు ప్రయాణికులకు మందులు అందజేశారు ప్రత్యేక శ్రద్ధతో ఆత్మకూరులో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన డిపో మేనేజర్ సోకేస్ యాదవ్ డిపో మేనేజర్ రాజ్ కుమార్ ఇతర సిబ్బందిని కార్మికులను సురేష్ రెడ్డి అభినందించారు. వైద్యులను రెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు ఈ మెగా మెడికల్ క్యాంపులో డాక్టర్ ఎం డి అబ్దుల్ రజాక్ డాక్టర్ వినోద్ బాబు డాక్టర్స్ సేవా డాక్టర్ జి జ్ఞాన ప్రసూన డాక్టర్ ఎన్ ప్రణయ్ కుమార్ డాక్టర్ డాక్టర్ అఖిల్ డాక్టర్ రేష్మ డాక్టర్ వంశీ డాక్టర్ సూర్య ఆర్టీసీ డిపో సిబ్బంది కార్మిక సంఘ నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు వైద్యులు పలువురు కార్మికులకు ప్రయాణికులకు పోయిన పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు .

# గుర్తు తెలియని మృత దేహం లభ్యం



**గూడూరు, జూలై 13, ప్రభాతవార్త :** గూడూరు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ పార్సెల్ ఆఫీస్ సమీపంలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న గూడూరు ఒకటో పట్టణ ఎస్ఐ మనోజ్ కుమార్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వివరాలు, మృతికి గల కారణాలపై ప్రాథమిక విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి 40 సంవత్సరాలు ఉండవచ్చని, మృతుడు కాఫీ రంగు టీ షర్టు, ఆలివ్ గ్రీన్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి గుర్తింపునకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు ఒకటవ పట్టణ సీఐ 9490413803 సమాచారం అందించాలని కోరారు.

# బాలబాలికలు ఆత్మవిశ్వాసంతో ఉండాలి



**కలువాయి జులై 13 ప్రభాతవార్త :** ప్రస్తుత సమాజంలో బాలబాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని వెరిబొట్ల పల్లి జడ్పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.ఐసిడిఎస్ ప్రాజక్టు డైరెక్టర్ బి.హేనాసుజన్ ఆదేశాల మేరకు వెరిబొట్ల పల్లి గ్రామం నందు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్బంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతు విద్యార్థిని, విద్యార్థులు ఎంతటి సమస్య అయినా చాకచక్యంగా పరిష్కరి ంచుకోవాలి తప్ప ఎటువంటి ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకోకూడదని అలాంటి ఆలోచనలు వచ్చిన వెంటనే మీ తల్లిదండ్రులకు గాని,స్నేహితులకుగాని తెలియపరచి సమస్య పరిష్కారం దిశగా పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులలో సోషల్ మీడియా ద్వారా విద్యార్థిని, విద్యార్థులు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అలా కాకుండా ప్రతి ఒక్కరుతమకంటు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని కష్టపడి అభివృద్ధి చెందాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలన ,బేటిబ చాబో,బటే పడావో, చైల్డ్ హెల్ప్లయన్స్,ఓమన్ హెల్ప్లయన్స్,టోల్ఫ్రీ మెంబర్స్, గుడ్టచ్,బ్యాడ్ టచ్ పలుఅంశాలపై అవగాహన కల్పిస్తు విద్యార్థులకు తెలియపరచారు.ఈకార్యక్రమంలో సఖివన్స్టాప్ సెంటర్, కేస్వర్కర్, పి శారద, అధ్యాపకులు పాల్గొన్నారు.

# పడమటిపాళెం నీటి సంఘం అద్యక్షులుగా మేకల రవీంద్ర



**సంగం జులై 13 ప్రభాతవార్త :** సంగం మండలం పడమటిపాళెం సాగునీటి సంఘం అద్యక్షుడిగా మేకల రవీంద్ర ఎన్నికఅయ్యారు.ఇటీవల పడమటిపాళెం సాగునీటి సంఘం అద్యక్షులు గంగపట్నం చంద్రశేఖరయ్య మృతి చెందడంతో అధ్యక్షపదవి ఖాళీ అయింది. ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో డిఈ పెంచలయ్య, ఏఈ వినయ్కుమార్,ఆద్వర్యంలో ఎన్నికల నిర్వహణ చేశారు. నూతనంగా మేకల రవీంద్రను ఎన్నిక చేశారు. అధికారులు,డైరక్టర్లు రవీంద్రను అభినందించారు.ఈ సందర్భంగా మేకల రవీంద్ర మాట్లాడుతు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో సాగునీటి సంఘం అబివృద్దికి కృషి చేస్తానని అన్నారు

# రేపటి నుండి పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభం

– జిల్లా వ్యవసాయ అధికారి పి. సత్యవాణి



**నెల్లూరు, జూలై 13, ప్రభాతవార్త – అగ్రికల్చర్ :** రైతులకు క్షేత్రస్థాయిలో సాంకేతిక సూచనలు అందించి, ఖరీఫ్ పంటలను అధిక దిగుబడులతో సాగు చేసే లక్ష్యంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఈ నెల 14వ తేదీ నుండి సెప్టెంబర్ 23వ తేదీ వరకు మొత్తం 11 వారాలు జిల్లాలో నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి పి. సత్యవాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి వారంలో మంగళవారం మరియు బుధవారం రోజుల్లో రోజుకు రెండు గ్రామాల చొప్పున వ్నారలో మొత్తం 4 గ్రామాలను అధికారులు సందర్శించి రైతులతో నేరుగా సమావేశమవుతారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖతో పాటు ఉద్యాన శాఖ, పశుసంవర్ధక, మత్స్య శాఖ, సహకార తదితర అనుబంధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొని రైతులకు పంటల ప్రస్తుత పరిస్థితులు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాల్సిన సాగు యాజమాన్య పద్ధతులు, చీడపీడలు మరియు వాటి నివారణ చర్యలు, ఏపిఏఐఎంఎస్ యాప్ వినియోగం,వాతావరణ హెచ్చరికలు, ఎల్నినో ప్రభావం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ పథకాలు మరియు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై సమగ్ర అవగాహన కల్పిస్తారు. అదేవిధంగా రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకొని, వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు అందించడంతో పాటు, సంబంధిత శాఖల సేవలను రైతులకు చేరువ చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. జిల్లాలోని రైతులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

# నెల్లూరులో రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



**నెల్లూరు క్రైం, జూలై 13, ప్రభాతవార్త :** వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురైన వ్యక్తి రైలు కింద పడి ప్రాణాలు కోల్పోయిన ఘటన నెల్లూరు సిటీలో సోమవారం చోటుచేసుకుంది. వేదయపాలెం నెల్లూరు రైల్వే స్టేషన్ మధ్య, సిటీలోని రామిరెడ్డి బ్రిడ్జి సమీపంలో హైదరాబాద్ చార్మినార్ ఎక్స్ప్రెస్ కింద పడడం వల్ల తీవ్ర గాయాలతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి సుమారు 40– 45 ఏళ్ళ మధ్య వయసు ఉంటుందని, నలుపు రంగు హాఫ్ హ్యాండ్స్ టీషర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఎటువంటి గుర్తింపు ఆధారాలు లభించలేదు. దీంతో మృతుడు ఎవరో ఇంకా గుర్తించలేకపోయారు. నెల్లూరు రైల్వే స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు జీఆర్పి ఎస్సై ఎన్. హరిచందన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే నెల్లూరు జీఆర్పి పోలీసులను సంప్రదించాలని సూచించారు.

# శివాలయంలో ప్రత్యేక పూజలు

**బిట్రగుంట జూలై 13 ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామి పాలెం గ్రామంలో మహా శైవాక్య యోగమైన రోజు పరమశివుడి నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం శివాలయంలో శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వర స్వామి వారికి పంచామృతాభిషేకం. అన్నాభిషేక కార్యక్రమం రామస్వామి పాలెం లో జరిగింది. స్వామివారి సేవ పరుడు ఆలయ వ్యవస్థాపకులు బత్తుల రవిచంద్ర సహకారంతో ఆలయ అర్చక స్వామి నరేష్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఆ స్వామివారికి మల్లెల మారేడు దళాలతో అర్చన కార్యక్రమం భక్తుల సహకారంతో జరిగింది ఈ కార్యక్రమంలో భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదములు స్వీకరించి. ఆ రామలింగేశ్వరుడి భక్తులు అనుగ్రహానికి పాత్రులు అయినారు.



## కుట్టు మిషన్‌లను వెంటనే ఇవ్వాలి

**గూడూరు, జూలై 13, ప్రభాతవార్త :** గూడూరు పట్టణంలోని డి.ఆర్.డబ్ల్యూ కళాశాల నందు టైలరింగ్‌లో శిక్షణ తీసుకున్న మహిళలకు కుట్టు మిషన్‌ను వెంటనే ఇవ్వాలని మహిళలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా గత సంవత్సరం ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం సర్టిఫికెట్, కుట్టు మిషన్‌ను ఇవ్వలేదని పేర్కొన్నారు. టైలరింగ్ ఇన్స్ట్రక్టర్ నాలుగు నెల ల పై ఫండ్ ను కూడా ఇవ్వలేదన్నారు. ఇకనైనా మాకు ప్రభుత్వం స్పందించి కుట్టు మిషన్లను ఇవ్వాలన్నారు. అనంతరం ఆర్డీవో అరుణకుమారికి వినతి పత్రం అందజేశారు. శ్యామల, జ్యోతి, అమరావతి, దక్ష, శారద, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.



## డప్పు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

**– డప్పు కళాకారుల సంఘం ప్రాంతీయ కార్యదర్శి రాగిపాటి నారాయణ**

**గూడూరు, జూలై 13, ప్రభాతవార్త :** డప్పు కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి ఆర్థిక భద్రత కల్పించాలని డప్పు కళాకారుల సంఘం ప్రాంతీయ కార్యదర్శి రాగిపాటి నారాయణ పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని సీపీఎం కార్యాలయం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు, ఉచిత వైద్యం కొరకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలన్నారు. అదే విధంగా పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. డప్పులు, ఇతర వాయిద్యాలను ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలన్నారు. వారికి ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూమిని ఇవ్వాలన్నారు. అనంతరం కెవిపిఎస్ ప్రాంతీయ కార్యదర్శి ఎంబేటి చంద్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వం డప్పు కారులకు వెంటనే పెన్షన్, సంక్షేమ పథకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం అధ్యక్షులు మస్తానయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జోగి శివ కుమార్, కెవిపిఎస్ అధ్యక్షులు అడపాల ప్రసాద్, సిఐటియు నాయకులు పాముంజి మణి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గండి కోట మధు, క్రాంతి డప్పు కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఉలవపాళ్లలో చోరీ కలకలం

**– రూ.2లక్షల నగదు, రెండు సవర్ల బంగారం, రెండు ట్రాక్టర్లలో డీజిల్ అపహరణ**





**దగదర్తి, జూలై 13, ప్రభాతవార్త :** దగదర్తి మండలంలోని ఉలవపాళ్ళ ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి చోరీ ఘటన చోటుచేసుకుంది. గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి రూ.2లక్షల నగదు, రెండు సవర్ల బంగారాన్ని అపహరించిందతో పాటు బయట నిలిపి ఉంచిన రెండు ట్రాక్టర్లలోని డీజిల్‌ను కూడా దొంగిలించారు. బాధితుడు చల్లా నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరులో కూరగాయలు, పండ్ల వ్యాపారం చేస్తూ వ్యవసాయ పనుల కోసం రెండు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేసిన ట్రాక్టర్ నెలవారీ వాయిదా చెల్లించేందుకు ఆదివారం సాయంత్రం సుమారు రూ.2లక్షల నగదును ఇంట్లోని బీరువాలో ఉంచి నెల్లూరుకు వెళ్లారు. రాత్రి సుమారు 12గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చిన నాగేశ్వరరావు ముందుగా బయట నిలిపిన ట్రాక్టర్లలో డీజిల్ దొంగిలించబడినట్లు గుర్తించారు. అనంతరం ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉండటంతో పాటు అందులో దాచిన రూ.2లక్షల నగదు, రెండు సవర్ల బంగారం కూడా చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై బాధితుడు దగదర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై మహేంద్ర తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## రేషన్ దుకాణాల డీలర్లు సమయ పాలన పాటించాలి

**బిట్రగుంట జూలై 13 ప్రభాతవార్త :** రేషన్ దుకాణాల్లో డీలర్లు సమయపాలన పాటించాలని కావలి సివిల్ సప్లైస్ డిప్యూటీ తాసిల్దార్ ఎం విజయమ్మ ఆదేశించారు మండలంలోని తీర ప్రాంతాల్లోని రేషన్ దుకాణాలను సోమవారం ఆమె తనఖీ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శక సూత్రాలు, నియమ నిబంధనలు డీలర్లు విధిగా పాటించాలని సూచించారు. వృద్ధులు, వికలాంగులకు ప్రతినెలా 26 నుండి నెలచివరవరకు ఇంటి వద్దనే సరుకులు అందించాలని ఆదేశించారు.



## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ప్రారంభం

**కొడవలూరు, జూలై 13 ప్రభాతవార్త:** ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని స్థానిక తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయ రైతులు పండించిన తాజా ఆకుకూరలు, కూరగాయలను రైతుల నుంచి నేరుగా వినియోగదారులకు అందించే విక్రయ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందులు లేకుండా పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతంగా చేపట్టి నాణ్యమైన ఆహార ఉత్పత్తులను ప్రజలకు అందించాలని సూచించారు. రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయడం వల్ల వినియోగదారులకు తాజా ఉత్పత్తులు అందడమే కాకుండా మధ్యవర్తుల ప్రమేయం తగ్గి రైతులకు అధిక ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## ఐఎఫ్‌టియు జిల్లా 3వ మహాసభను జయప్రదం చేయండి

**– ఐఎఫ్‌టియు జిల్లా గౌరవ అధ్యక్షులు డి.పి. పోలయ్య**

**గూడూరు, జూలై 13, ప్రభాతవార్త :** జూలై 15న గూడూరులోని రిటైర్డ్ అధికారుల భవనంలో ఐఎఫ్‌టియు జిల్లా 3వ మహా సభను నిర్వహిస్తున్నామని జిల్లా గౌరవ అధ్యక్షులు డి.పి. పోలయ్య పేర్కొన్నారు. ఈ మహాసభకు ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎన్వి.కృష్ణ, రామకృష్ణలు పాల్గొంటారన్నారు. ఆయన మాట్లాడుతూ దేశ సంపదను సృష్టించే కార్మికుల హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్ కార్మిక వ్యతిరేకమైనవని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను ఈ కోడ్స్ ద్వారా హరించే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం వల్ల లక్షలాది మంది కార్మికులు ఉద్యోగ భద్రత కోల్పోతున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేకపోవడం, కనీస వేతన చట్టాలు అమలు కాకపోవడం, కార్మిక సంక్షేమ చట్టాలను యాజమాన్యాలు ఉల్లంఘిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు చూసీ చూడనట్లు వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. దేశవ్యాప్తంగా సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్, సామాజిక భద్రతా పథకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులపై జరుగుతున్న దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికోద్యమాన్ని బలోపేతం చేసేందుకు, సమస్యలపై పోరాడేందు అవసరమైన నాయకత్వాన్ని రూపొందించుటకు నిర్వహించే జిల్లా మహా సభను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి చెంగళరావు, జిల్లా అధ్యక్షా కార్యదర్శులు నవకోటి, అనీల్, ఐ.ఎఫ్.టి.యు నాయకులు రత్నయ్య పాల్గొన్నారు.



## నేడు రాజకీయ పార్టీ నేతలతో ప్రత్యేక సమావేశం

**కోవూరు, జూలై 13 ప్రభాతవార్త :** కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కోవూరు నియోజకవర్గంకు సంబంధించి ఎస్ఐఆర్ కార్యాచరణ ప్రణాళిక విషయంలో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీల నేతలతో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య తెలిపారు. ఈ సమావేశానికి రాజకీయ పార్టీల నేతలు హాజరై ఎస్ఐఆర్‌కు సంబంధించి సూచనలు, అభిప్రాయాలు ఇవ్వాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## వైభవంగా ఆరుద్ర నక్షత్ర పూజలు : ఆకట్టుకున్న పల్లకి సేవ

**కోవూరు, జూలై 13 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామివారి దేవస్థానంలో దశాబ్దాల కాలం తర్వాత వచ్చే ఆరుద్ర నక్షత్రం మాస శివరాత్రి సోమవారం పర్వదినం సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఇటువంటి పర్వదినం సందర్భంగా పెద్ద ఎత్తున మహిళా భక్తులు ఆలయానికి చేరుకుని అభిషేక కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కరుణా కటాక్షాలు పొందారు. అనంతరం శివభక్త బృందం ఆధ్వర్యంలో పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అంతకుముందు అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులకు పోలుదాసు కుటుంబ సభ్యులు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



**గ్రామ పంచాయితీ కార్యాలయము, నాగమాంబపురం**

ఆర్.ఓ.సి.నెం.04/2026 — తేది: 13.07.2026

**టెండరు నోటీసు**

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాలెం మండలం, నాగమాంబపురం గ్రామ పంచాయితి పరిధిలో పూర్తి కాంట్రాక్టు పద్ధతిన దిగువ సేవలకు సహాయకులను ఒక సంవత్సరము కాలమునకు అనగా తేది.01.04.2026 నుండి తేది.31.03.2027 వరకు సరఫరా చేయుటకు ఆసక్తి గల టెండరుదారుడి నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. సదరు సీల్డ్ టెండర్లు దాఖలు తేది.28.07.2026 న మంగళవారం ఉదయము గం.10.30 నుండి మధ్యాహ్నము గం.3.00ల వరకు గ్రామ పంచాయితి కార్యాలయములో గ్రామ పంచాయితి పని వేళల యందు సీల్డ్ టెండర్లను స్వీకరించబడును. సదరు సీల్డ్ టెండర్లను తేది. 28.07.2026 న సాయంత్రము 4.00 గంటలకు హాజరైన టెండరు దారుల సమక్షములో తెరువబడును. మిగిలిన నిబంధనలు మరియు వివరములు ఈ కార్యాలయము పని వేళల యందు తెలుసుకొనవచ్చును మరియు షరతులు వర్తించును.

| వ.నెం. | వివరములు | టెండరు ధరావత్తు |
|---|---|---|
| 1 | స్వీపర్ (1) ఒకరు, రక్షిత మంచి నీటి సరఫరా స్కీము మోటార్ నిర్వహణ కొరకు పంపు ఆపరేటర్లు (4) నలుగురు మరియు ఎలక్ట్రీషియన్(1) ఒకరు మొత్తం 6 మందిని కాంట్రాక్టు పద్ధతిన సరఫరా చేయుట. | రూ.500 |

గమనిక: పై టెండర్లు ఆమోదము తెలుపుటకు లేదా రద్దు పరుచుటకు గ్రామ పంచాయితీ వారికి అధికారం కలదు. టెండరు తేదీ నాడు ప్రభుత్వం వారు సెలవు దినముగా ప్రకటించిన యెడల మరుసటిరోజు కార్యాలయము పని వేళలో టెండర్లను స్వీకరించబడును. విధి నిర్వహణలో ఏదైనా ప్రమాదము జరిగిన పంచాయితి వారు బాధ్యులు కారు. ఎటువంటి నష్ట పరిహారము చెల్లించబడదు. టెండరుదారుని పనితీరు సంతృప్తికరముగా లేని యెడల వారి యొక్క టెండరును రద్దు పరుచుటకు గ్రామ పంచాయితికి అధికారము కలదు.

గ్రామ పంచాయితి నందు నిధుల లభ్యతను బట్టి జీతములు ఇవ్వబడును.

పంచాయితి సెక్రటరీ
నాగమాంబపురం గ్రామ పంచాయితి

## మాక్ ఎలక్షన్‌తో ప్రజాస్వామ్య విలువలపై అవగాహన

**– నాగార్జున స్కూల్ ఎలక్షన్ – 2026 నిర్వహణ**

**పొదలకూరు, జూలై 13, ప్రభాతవార్త :** విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాముఖ్యత, బాధ్యతాయుత పౌరసత్వంపై అవగాహన కల్పించేందుకు స్థానిక నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ సోమవారం మాక్ ఎలక్షన్–2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత, స్కూల్ కరస్పాండెంట్ ఎం. సుధాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియ, ఓటు విలువ, మంచి నాయకత్వ లక్షణాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి బాధ్యతగల పౌరులు, నాయకులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎన్నికల ప్రక్రియను ప్రత్యక్షంగా నిర్వహించి, అభ్యర్థుల ప్రచారం, రహస్య ఓటింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వంటి దశలను అనుభవాత్మకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు ప్రాముఖ్యత, నిష్పాక్షిక ఎన్నికల అవసరం, రాజ్యాంగబద్ధ బాధ్యతలపై ప్రిన్సిపాల్ లక్ష్మి దుర్గా, ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. పాఠశాల యాజమాన్యం సుబ్బారావు, చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత నిర్ణయ సామర్థ్యం, ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం జీ.వీ.ఆర్, పాపయ్య, కృష్ణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థి పల్లాల కొండారెడ్డి ఔదార్యం

**వింజమూరు, జూలై 13, ప్రభాతవార్త :** తాను పుట్టి పెరిగిన మట్టికి చదివిన బడికి ఏదో ఒకటి చేయాలి వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షుడు స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పల్లాల కొండారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటుకు రెండున్నర లక్ష అందజేశారు. సోమవారం దుత్తలూరు లోని సీడ్స్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో పాఠశాలకు అవసరమైన ఆధునిక గ్రంథాలయాన్ని సొంత నిధులతో పల్లాల కొండారెడ్డి అందజేశారు. ప్రస్తుతం ఈ గ్రంథాలయం ద్వారా పాఠశాలలోని సుమారు వెయ్యి మంది విద్యార్థులు పుస్తకాలు చదివి తమ జ్ఞానాన్ని ఆలోచనాశక్తిని పెంపొందించుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు పల్లాల కొండారెడ్డి మాట్లాడుతూ ఈ రోజులలో చిన్నపిల్లల నుండి పెద్దవారి వరకు సెల్ ఫోను సోషల్ మీడియాకు బానిసలు అవుతున్నారని మన చరిత్ర పుస్తకాలు చదివే అలవాటు తప్పిపోతుందని ఆలోచించి విద్యార్థులను పుస్తకాలు దగ్గరకు చేర్చాలని ఉద్దేశంతో ఈ గ్రంథాలయంను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ గ్రంథాలయం విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందన్నారు. ఈ సందర్భంగా సీడ్స్ సీఈఓ ఆర్. పురుషోత్తం మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యులు విద్యావేత్త పల్లాల కొండారెడ్డి అందించిన సహాయం ఆదర్శప్రాయం అన్నారు. ఇలాంటి పూర్వ విద్యార్థులు ముందుకు వస్తే ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



## స్కూల్ సాయిల్ హెల్త్‌పై విద్యార్థులకు అవగాహన

**దగదర్తి, జూలై 13, ప్రభాతవార్త :** దగదర్తి ప్రభుత్వ జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం స్కూల్ సాయిల్ హెల్త్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నెల్లూరు కేవీకే భూసార శాస్త్రవేత్త పి.అనూష మట్టి నమూనాల సేకరణ వాటి ప్రాధాన్యత సమశ్యాత్మక భూములు గురించి వివరించారు. నెల్లూరు సాయిల్ టెస్ట్ లేబొరేటరీ వ్యవసాయాధికారి మాట్లాడుతూ మట్టి నమూనాల సేకరణ, పరీక్ష, ఎరువుల యాజమాన్యం, సూక్ష్మ పోషకాల వినియోగం తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వి.దేవసేన రసాయన ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువులు ఎక్కువ వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దగదర్తి వ్యవసాయాధికారి ఎస్.రామమోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారుతీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## దాహంతో అల్లాడుతున్న ప్రజలు అధికారుల నిర్లక్ష్యం







**ఆత్మకూరు, జులై 13, ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలో గత రెండు వారాలుగా కొనసాగుతున్న తాగునీటి సంక్షోభం అధికారుల నిర్లక్ష్యం, ముందస్తు ప్రణాళికల లోపానికి నిదర్శనమని, ఉత్తరకాలువ మరమ్మతుల కారణంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మూడు నెలల ముందే తెలిసినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం అధికారుల వైఫల్యమేనని వైఎస్సార్సీపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీపట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ పట్టణంలోని 23 వార్డుల ప్రజలు గుక్కెడు తాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారని, నీటి కోసం మహిళలు బిందెలతో గంటల తరబడి ఎదురు చూసే పరిస్థితి నెలకొన్నప్పటికీ అధికారులు మాత్రం స్పందించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ముందస్తు ప్రణాళికతో ప్రత్యామ్నాయ నీటి సరఫరా వ్యవస్థను సిద్ధం చేసి ఉంటే నేడు ప్రజలు ఈ దుస్థితిని ఎదుర్కోవాల్సిన అవసరం ఉండేదే కాదన్నారు. అప్పారావుపాళెం నుంచి ఆరు వార్డులకు సరఫరా చేస్తున్న పెన్నానది నీటిని అవసరాన్ని బట్టి మరిన్ని వార్డులకు విస్తరించే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ వనరులను కూడా సక్రమంగా వినియోగించకుండా, పైపులైన్ ద్వారా జరుగుతున్న సరఫరాను కొద్ది రోజుల పాటు నిలిపివేయడంతో సమస్య మరింత తీవ్రమైందన్నారు. ప్రజలకు కనీస అవసరమైన తాగునీటిని కూడా అందించలేని పరిస్థితి ఏర్పడడం మున్సిపల్ పాలన వైఫల్యానికి నిదర్శనమని నాయకులు మండిపడ్డారు. స్వచ్ఛభారత్ మిషన్ కింద నిర్మించిన మరుగుదొడ్లను కూడా నీటి కొరత కారణంగా ప్రజలు వినియోగించలేకపోతున్నారని, పట్టణంలో పారిశుధ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 12 ఏళ్ల మున్సిపల్ చరిత్రలో ప్రజలు ఇంత తీవ్ర తాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కోలేదని పేర్కొన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాపైనే ఆధారపడే పరిస్థితి తీసుకొచ్చి అధిక బిల్లులు చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని అన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రతి వార్డుకు ప్రతిరోజూ సురక్షితమైన తాగునీరు అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను కోరారు. సమస్యను అత్యవసరంగా పరిగణించి యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, లేకపోతే ప్రజల్లో ఆగ్రహం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మరో రెండు రోజుల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే మహిళలు, ప్రజలతో కలిసి మున్సిపాలిటీ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపడతామని వైఎస్సార్సీపీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు అంద్రా సుబ్బారెడ్డి, తోడేటి మణి, ఇందూరు సురేంద్రరెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ వైసీపీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు నందవరం ప్రసాద్, పట్టణ మైనారిటి అధ్యక్షులు మీరామొహిద్దీన్, ముజీబుల్లా, షేక్ రహీం, షేక్ పర్వీన్, పట్టణ యువత అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రెడ్డి, పట్టణ కార్యవర్గసభ్యులు సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, బ్రహ్మనాయుడు, వెంకటేశ్వర్లు, వెంగళరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, జమ్రు, మల్లికార్జున, షారూక్, యర్రగుంట్ల మల్లికార్జున, యడ్ల విష్ణు, బాలచెన్నయ్య, యానాదిరెడ్డి, యస్థాని, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

## తుది దశలో ఎస్ఐఆర్ ప్రక్రియ

**– గడువు నాటికి పూర్తి చేసేందుకు చర్యలు**

**– బీఎల్వోలు–బీఎల్ఏల సమన్వయంతో వేగవంతం– తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి**

**కొడవలూరు, జూలై 13 ప్రభాతవార్త:** మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ తుది దశకు చేరుకుందని, ప్రభుత్వం నిర్దేశించిన గడువు నాటికి పూర్తయ్యేలా అన్ని చర్యలు చేపట్టినట్లు తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి తెలిపారు. మండలంలోని 55 పోలింగ్ బూత్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు బూత్ స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ పరస్పర సమన్వయంతో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా కొనసాగిస్తున్నారని చెప్పారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్ల తొలగింపు, ద్వంద్వ నమోదుల గుర్తింపు, చిరునామా మార్పులు, పేర్ల సవరణలు, ఇతర అభ్యంతరాల పరిశీలన తదితర ప్రక్రియలను నిబంధనల ప్రకారం పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. బీఎల్వోలు సేకరించిన వివరాలను బీఎల్ఏలతో మరోసారి ధ్రువీకరించి తుది నివేదికను సిద్ధం చేస్తున్నామని, ప్రభుత్వం నిర్దేశించిన గడువు నాటికి ప్రక్రియను పూర్తిచేసి సంబంధిత ఎన్నికల అధికారులకు నివేదిక పంపనున్నట్లు పేర్కొన్నారు. ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పుల్లేకుండా ఉండేలా ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తూ విధులు నిర్వహిస్తున్న బీఎల్వోలు, బీఎల్ఏలను ఆమె అభినందించారు. ఇదే సమన్వయంతో గడువులోగా ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు.



## ఆయుష్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**కోవూరు, జూలై 13 ప్రభాతవార్త :** ఆయుష్ శాఖ ద్వారా అనేక రకాల మొండి రోగాలు నయం చేసే మందులు ఉన్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయుష్ శిబిరాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఇనమడుగు హోమియో వైద్యులు కరుణాకర్, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ హేమంత బాబులు తెలిపారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఆయుష్ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా వ్యాధి విషయంలో కూడా ఆయుష్ శాఖ మంచి వైద్యం అందించిందన్నారు. బీపీ , షుగర్, చర్మ వ్యాధులు, తదితర వ్యాధులతో బాధపడే వారు ఈ శిబిరాలను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ శాఖ ఉద్యోగులు మల్లయ్య, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.



## కళాకారులకు 8 వేలు పింఛన్ ప్రభుత్వం పెంచాలి

**కోవూరు, జూలై 13 ప్రభాతవార్త :** ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కళాకారుల వృద్ధాప్య పెన్షన్‌ను 8 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం కోవూరు తహసీల్దార్ కార్యాలయ ఎదుట కళాకారులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ సభ్యుడు గండవరపు శేషయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కళాకారుల అభివృద్ధి కోసం అనేక వాగ్దానాలు చేసిందన్నారు. రెండు సంవత్సరాలు అయినా నేటికీ గుర్తింపు కార్డు కూడా ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. బడ్జెట్‌లో సైతం కళాకారుల సంక్షేమం కోసం నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. కళారంగంపై ఆధారపడిన కోలాటం డప్పులు, చెక్క భజనలు, తోలుబొమ్మలాట, డ్రామా ఆర్టిస్టులు అనేక మంది ఈ కళనే నమ్ముకుని 4 వేల పెన్షన్‌తో బతుకు సాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కళాకారులకు 8 వేలు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి కళాకారులు మణివర్మ, సురేష్, రమేష్, విజయ్‌కుమార్, మోహన్, శివ, యస్థాని, తదితరులు ఉన్నారు.



## పోలీస్‌స్టేషన్‌కు బీపీసీఎల్ ద్వారా డస్ట్ బిన్‌లు పంపిణీ

**కోవూరు, జూలై 13 ప్రభాతవార్త :** కోవూరు పోలీస్ స్టేషన్‌కు సోమవారం బీపీసీఎల్ ఆధ్వర్యంలో స్వచ్ఛ పక్వాడ కార్యక్రమంలో భాగంగా డస్ట్ బిన్‌లను, వాటర్ బాటిళ్లను, జూట్ బ్యాగులను అందజేశారు. బీపీసీఎల్ ఆఫీసర్ బి. నాగ భాస్కర్ మాట్లాడుతూ స్వచ్ఛ పక్వాడ కార్యక్రమంలో భాగంగా బీపీసీఎల్ ద్వారా ఈ సామాజిక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింద న్నారు. అనంతరం ఎస్సై ముత్యాలరావు బీపీసీఎల్ ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బీపీసీఎల్ సూపర్‌వైజర్ అరవింద్, ఎస్ఈఆర్ కె. బ్రహ్మాజీ, తదితరులు ఉన్నారు.



## సోమశిల, కండలేరు జలాశయాల పెండింగ్ పనులను పూర్తి చేయాలి

**– కండలేరు జలాశయం మట్టి కట్టను పటిష్ట పరచాలి**

**– జలాశయాల నిర్వహణకు సిబ్బందిని పెంచాలి**

**– బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్**

**నెల్లూరు, జూలై 13, ప్రభాతవార్త – అగ్రికల్చర్ :** సోమశిల, కండలేరు డ్యామ్‌లలో అసంపూర్తిగా మిగిలి ఉన్న పనులను వెంటనే చేపట్టాలని కోరతూ విజయవాడ సిడిఓ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్ శ్రీరామదాసుకు బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశిల జలాశయం ఆఫ్రాన్ 2021 వరదల్లో కొట్టుకుపోయిందన్నారు. ఆ పనులను అరాకొరా పూర్తిచేసే ఆపివేసి ఉన్నాయని వెల్లడించారు. జలాశయం భద్రతలో భాగంగా ఆఫ్రాన్ పనులను వెంటనే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కండలేరు డ్యామ్ మట్టికట్ట 8 కిలోమీటర్ల నుండి 10 కిలోమీటర్ల మధ్యలో కుంగడం జరిగిందని ఆ మట్టి కట్టను వెంటనే పటిష్ట పరచాలని డిమాండ్ చేశారు. జలాశయాన్ని పూర్తిస్థాయిలో నీటితో నింపిన సందర్భంలో మట్టికట్ట దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఈ మట్టి కట్టను 350 కోట్ల రూపాయలతో వెడల్పు చేసి పటిష్ట పరచాలని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే రెండు డ్యామ్ లలో సిబ్బంది కొరతను తీర్చాలన్నారు. సోమశిల జలాశయంలో 2010లో 47 మంది సిబ్బంది ఉండగా ప్రస్తుతం 5 మంది మాత్రమే జలాశయం నిర్వహణలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కండలేరు జలాశయంలో గతంలో 35 మంది సిబ్బంది ఉండగా నేడు వారు కూడా 5 మంది మాత్రమే నిర్వహణలో ఉన్నారని గుర్తు చేశారు. జలాశయాల భద్రతను దృష్టిలో పెట్టుకుని సాంకేతిక సిబ్బందిని తగినంత మందిని నియమించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు నరాల సుబ్బారెడ్డి, అల్లూరు నాగేంద్ర సింగ్, ముని, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## పంచాయతీ నిధులు దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ

**వింజమూరు, జూలై 13, ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ నిధుల దుర్వినియోగ ఆరోపణలపై సోమవారం విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి వేణుగోపాలరావు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. పంచాయతీ మాజీ సర్పంచ్‌పై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించమన్నారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ విచారణ పూర్తిచేసే సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు ఉన్నారు.



